మల్కాజిగిరి లోక్‌సభ బరిలో 22 మంది అభ్యర్థులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం బరిలో 22 మంది అభ్యర్థులు మిగిలారని ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. పరిశీలన తర్వాత 37 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించామన్నారు. ఉపసంహరణ కార్యక్రమంలో భాగంగా 15 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా, 22 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారన్నారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు వారి సమక్షంలో గుర్తులు(సింబల్) కేటాయించినట్లు ఆయన తెలిపారు.

వైభవంగా బీరప్ప కల్యాణ మహోత్సవం



బీరప్ప కల్యాణ మహోత్సవంలో వజ్రేష్‌యాదవ్, మేయర్ శాంతి, శ్రీకాంత్‌యాదవ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని బీజేఆర్‌నగర్‌లోని బీరప్ప దేవాలయంలో కురుమ సంఘం అధ్యక్షులు రేగు రాజు ఆధ్వర్యంలో సోమవారం బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. బీరప్ప ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో మెలగాలన్నారు. మానవుడిని సన్మార్గంలో నడిపించేది భక్తి మార్గమేనని, బీరప్పకామరాతిల చరిత్ర గొప్పదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లపు రవి, వేణు, లావణ్యసతీష్‌గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, నాయకులు వినయ్‌కుమార్, శ్రీనివాస్, అనంతలక్ష్మీ, పెద్ద కురుమ వాసర్ల కొండయ్య కురుమ, చిన్నం యాదగిరి, రేగు సత్తయ్య, మారయ్య, రాజు, బీరుమల్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు

శామీర్‌పేట్: పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు సమక్షంలో సోమవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు కవాతు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాలైన తూంకుంట, మూడుచింతలపల్లి గ్రామాల్లో సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు.

రూ.లక్ష స్వాధీనం

ఘట్‌కేసర్: ఎన్నికల కమిషన్ ఆదేశం మేరకు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఐ సైదులు ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీకి చెందిన వ్యాపారి అజిత్‌కుమార్ యాక్టీవాలో తరలిస్తున్న రూ.లక్షను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న రూ.లక్షను కలెక్టర్ కార్యాలయానికి పంపామన్నారు.

రవీందర్ పాకాలకు డాక్టరేట్



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సీఈటీ (సీఎంఆర్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల అధ్యాపకుడు రవీందర్ పాకాలకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈయన ఉస్మానియా యూనివర్సిటీలో డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రోమాగ్నటిక్ బాండ్ గ్యాప్ స్ట్రక్చర్డ్ అల్ట్రా బాండ్ మీద పరిశోధన చేశారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, ప్రిన్సిపల్ వీఏ నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కీసర డీఈ భాస్కర్‌రావు సస్పెండ్

కీసర: అనుమతి లేకుండా ఎల్‌సీ(లైన్ క్లియరెన్స్) ఇచ్చారంటూ కీసర డీఈ భాస్కర్‌రావును విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. నాగారంలో అనుమతి లేకుండా ఎల్‌సీ ఇవ్వడంతో శనివారం ఉదయం రాంపల్లిచౌరస్తా ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తింది. అదే సమయంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి రాంపల్లి చౌరస్తాలోని మినీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యనేతల సమావేశానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతుండగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆయన విమర్శలు వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేపట్టిన డిస్కం అధికారులు అనుమతి లేకుండా ఎల్‌సీ తీసుకొని పనులు చేస్తున్నట్లు గుర్తించి డీఈ భాస్కర్‌రావుపై చర్యలు తీసుకున్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

ఘట్‌కేసర్: రోడ్డు ప్రమాదంలో గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు మంగళవారం మృతి చెందాడు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయపురి కాలనీ ఉప్పల్‌కు చెందిన కొమ్మిడి అమృత్‌రెడ్డి(62), లలిత ఈ నెల 17న ఉప్పల్ నుంచి భువనగిరివైపు బైక్‌పై వెళ్తుండగా అవుషాపూర్ వంతెన వద్ద అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. దీంతో అతడి తల, ఇతర శరీర భాగాలకు గాయాలు కాగా ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో అటువైపు వెళ్తున్న వారి బంధువు కొమ్మిడి మోహన్‌రెడ్డి వెంటనే వారిని ఆదిత్య ఆస్పత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గోలీసోడా తయారీదారుడిపై కేసు

ఘట్‌కేసర్: ప్రజల అనారోగ్యానికి కారణమవుతూ అనుమతి లేకుండా గోలీ సోడా తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిపై ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎదులాబాద్‌లోని సాయితేజ కిరాణ దుకాణంలో తనిఖీ చేశారు. వివిధ ఫ్లేవర్లలో ఉన్న బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆహార భద్రత నియమాలు ఉల్లంఘించిన చందుపట్లగూడకు చెందిన సల్ల సాయితేజపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



- పార్లమెంట్ ఎన్నికల్లో కనిపించని హవా
- పైపై ప్రచారాలకే పరిమితం
- జాడలేని ఇంటింటి ప్రచారం
- అగ్ర నాయకుల సభలపైనే ఆధారం

సోసోగా ప్రచారం

మేడ్చల్: ఎన్నికలు ఏవైనా ప్రచార రథాల జోరు.. ఉదయం నుంచి సాయంత్రం వరకు మైకుల మోత రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారాలు, ఓటరును కలిసి బొట్టుపెట్టి ఓటు అడగడం, రాత్రయితే విందులు, కార్యకర్తలు, నాయకులు బిజీగా గడపడం ఇవన్నీ కనిపిస్తాయి. మేడ్చల్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇలాంటి జోరు ఎక్కడా కనిపించడం లేదు. అభ్యర్థుల ప్రచారాలు, ఫంక్షన్ హాల్స్‌లో సమావేశాలు, సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం మినహా ఎక్కడా ఓటరు దగ్గరకు వెళ్లి ప్రచారం చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. అభ్యర్థులు రోడ్ షోలు, సమావేశాలు వంటి వాటిల్లో తిరుగుతుండగా అభ్యర్థుల కుటుంబసభ్యులు అక్కడక్కడా ఇంటింటి ప్రచారం చేస్తూ కనిపిస్తున్నారు.

ఐదు నెలల క్రితం జోరు.. నేడు అంతంతే..

ఐదు నెలల క్రితం రాష్ట్ర అసెంబ్లీకి నవంబర్ 30న ఎన్నికలు జరగ్గా ఆ జోరు రెండు నెలల పాటు మామూలుగా కనిపించలేదు. ప్రచార హోరుతో ప్రజలే విసుగెత్తే వరకు సాగింది. మైకుల మోతతోనే ఓటరు నిద్ర లేస్తే.. రాత్రి నాయకుల పలకరింపుతో రోజు ముగిసేది. ఓటరు వద్దకు నిత్యం ఏదో ఒక పార్టీ వారు రావడం, దండాలు పెట్టడం, తాయిలాలు ఇవ్వడం, హామీలు ఇవ్వడం వంటివి జోరుగా సాగేవి. కాలనీలు, గ్రామాల్లో ప్రధాన పార్టీల ప్రచార రథాలు జోరుగా తిరుగుతూ ప్రచారం సాగించేవి. అభ్యర్థులు, ప్రధాన నాయకులు, స్థానిక నాయకత్వంతో కలిసి జోరుగా ప్రచారం చేసేవారు.

కనిపించని ఎన్నికల రథాలు

అసెంబ్లీ ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికలకు తేడా చాలా ఉన్నప్పటికీ ఎక్కడి వారు అక్కడ ప్రచారం చేయకపోవడం విడ్డూరంగా కనిపిస్తోంది. పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండటంతో అభ్యర్థికి, ప్రధాన నాయకులకు అన్ని నియోజకవర్గాల్లో తిరగడం కష్టం. అభ్యర్థులు కనబడినా కనబడకపోయినా వారి తరఫున ప్రచారం మాత్రం మేడ్చల్‌లో ఎక్కడా కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్న పార్టీల బలగం ఇప్పుటి ఎన్నికల్లో ఉన్నా కొన్ని పార్టీలకు పెరిగినా, తగ్గినా ప్రచార హోరు మాత్రం కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కో పార్టీ నుంచి ఒక్కో రూట్లో రెండేసి ప్రచార రథాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు తిరుగుతూ మైకుల మోతతో ప్రచారానికి హంగులు తెచ్చేవి. ప్రస్తుత ఎన్నికల్లో రోజుకో రథం కూడా కనిపించడం లేదు. అభ్యర్థులు, ప్రధాన నాయకులు ఎక్కడ తిరిగితే ఆ ప్రాంతంలోనే మైకుల మోత వినిపిస్తోంది.

పట్టించుకోని స్థానిక నాయకులు..

తమకు కేసీఆర్ బలం ఉంది.. తమకు మోదీ బలం ఉంది.. తమ పార్టీకి రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి బలం ఉంది. ఆ నియోజకవర్గంలో ఎక్కువ ఓట్లు వస్తాయి. ఆయన బలమైన నాయకుడు.. అక్కడ మెజార్టీ తమకే అని ఇంట్లో కూర్చొని లెక్కలు వేసుకుంటున్నారే తప్ప క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఓటరును కలిసే ప్రయత్నాలు నాయకులు ఎక్కడా చేయడం లేదు. కొన్నిచోట్ల తిరుగుతున్నా మెజార్టీ ప్రాంతాల్లో ప్రచార హోరు కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులు ప్రతి నాయకుడితో పని చేయించారు. బూత్‌కు ఇంత, ఖర్చుల కింద, మందు విందులకు ఇంత, రోజు వారి ఖర్చులకు ఇంత అని లెక్కగట్టి డబ్బులు పంపిణీ చేసే వారు. పని చేయించడం, ఖర్చులకు డబ్బులు రావడంతో నాయకులు అప్పట్లో జోరుగా కనిపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో డబ్బు, రాజకీయ ప్రభావం తక్కువగా ఉండటం, డబ్బు రాజకీయానికి అలవాటు పడ్డ మేడ్చల్ నాయక గణం ప్రచారంలో వడివడిగా అడుగులు వేసేందుకు వెనకడుగు వేస్తున్నట్లు కనిపిస్తోంది.

వెనుకబడ్డ కాంగ్రెస్, బీఆర్ఎస్..

మల్కాజ్‌గిరి నియోజకవర్గ పరిధిలో బీజేపీ కోసం ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం చేసినా ప్రచార హోరులో మాత్రం స్పీడు పెరగడం లేదు. ప్రచారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు పూర్తిగా వెనుకబడి కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌కు పెద్ద దిక్కయిన ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రచారాన్ని సమావేశాలకు పరిమితం చేయగా, కాంగ్రెస్ నాయకులు గ్రూపులుగా ఉండటం ఎవరికివారే అన్నట్లు వ్యవహరిస్తుండటంతో నడిపించే వారు లేకుండాపోయారు. బీజేపీ నాయకుల ప్రచారం మాత్రం జోరుగా సాగకున్నా మిగతా పార్టీలకంటే నయంగా కనిపిస్తోంది. మండలాలకు, మున్సిపాలిటీలకు ఇన్‌చార్జిలను నియమించకున్నా చాలా గ్రామాలు, వార్డుల్లో అన్ని పార్టీలలో ఓటర్లను ఓటడిగిన నాయకులే లేకుండా పోయారు. అన్ని పార్టీల్లోని ప్రధాన నాయకుల పనితీరు పని తక్కువ.. బిల్డప్ ఎక్కువ కనిపిస్తోంది. ఐదు నెలల్లో రాష్ట్రం, దేశంలో ఎన్నికలు జరుగుతున్నా రాష్ట్ర ఎన్నికలకు ఒక రకంగా దేశ ఎన్నికలకు మరో రకంగా నాయకుల వ్యవహార శైలి ఉండటంతో ఓటర్లు నాయకుల తీరు పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పథకాలే బీజేపీని గెలిపిస్తాయి



మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డికి కండువా కప్పుతున్న ఈటల రాజేందర్, చిత్రంలో సుదర్శన్‌రెడ్డి, ప్రవీణ్‌రావు



అంకుషాపూర్‌లో ప్రచారం చేస్తున్న ప్రవీణ్‌రావు, శోభారాణి, బాల్‌రాజ్‌ముదిరాజ్

ఘట్‌కేసర్: దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజాసంక్షేమ పథకాలు బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తాయని మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. స్థానిక సుప్రభాత్ టౌన్‌షిప్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో కాచవానిసింగారం గ్రామ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, చౌదరిగూడకు చెందిన నాగరాజు మరి కొందరు ఇతర పార్టీల నాయకులు సోమవారం బీజేపీలో చేరారు. ఈటల రాజేందర్ వారికి కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. నరసింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ నరసింహ, కౌన్సిలర్ మహేశ్, బస్వరాజ్‌గౌడ్, ప్రభంజన్‌గౌడ్, శివరాజ్‌గౌడ్, సురేశ్‌నాయక్, రఘు, అశోక్‌ముదిరాజ్, స్నేహ, శంకర్, దినేశ్, జితేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంకుషాపూర్‌లో బీజేపీ ప్రచారం

మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శోభారాణి, బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో అంకుషాపూర్‌లో ప్రచారం చేశారు.

బీజేపీ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

కీసర: మేడ్చల్–మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు కోసం నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బీజేపీ నేతలు తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. తొమ్మిదేళ్ల కాలంలో దేశంలో నరేంద్రమోదీ ప్రధానిగా, బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మరోసారి బీజేపీకి ఓట్లు వేయాలని కోరుతున్నారు. నాగారం మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి, బీజేపీ నేతలు జిల్లాల తిరుమల్‌రెడ్డి, బాపిరెడ్డి, బాల్‌రాజ్, బండారి శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్, ఆంజనేయులు, నాగేష్, మహేందర్‌యాదవ్, రాముచారి, చినింగని సుధాకర్, నల్లవెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, మెట్టు కృష్ణాయాదవ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఈటల గెలుపు ఖాయం

మేడ్చల్‌రూరల్: మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు ఖాయమని మేడ్చల్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఈటల రాజేందర్‌కు మద్దతుగా గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు ఉసిగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 6వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



కీసరలో ఈటల రాజేందర్ గెలుపు కోసం బీజేపీ నేతల ప్రచారం



గుండ్లపోచంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కాంగ్రెస్‌లో చేరిన చీర్యాల మాజీ సర్పంచ్



కాంగ్రెస్‌లో చేరుతున్న తుంగ ధర్మేందర్ తదితరులు

కీసర: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నేతలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. తోటకూర జంగయ్యయాదవ్, మలిపెద్ది సుధీర్‌రెడ్డి సమక్షంలో చీర్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తుంగ ధర్మేందర్ సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కీసర మండల అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, నరసింహయాదవ్, చిందం అరుణ్‌కుమార్, సింగిరెడ్డి శశిధర్‌రెడ్డి, సింగిరెడ్డి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదు నెలలో పెరిగిన ఓటర్లు 28,141

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికలకు మధ్య 28,141మంది ఓటర్లు పెరిగారు. మేడ్చల్ నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల నాటికి 6,37,838 మంది ఓటర్లు ఉండగా నేటి ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య 6,65,979 మందికి చేరింది. నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు నియోజకవర్గంలో 28,141 ఓటర్లు పెరిగారు. ఇందులో పురుషులు 3,40,218 మంది ఉండగా మహిళలు 3,25703 మంది 58 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా సహకరించాలి

జనరల్ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా

సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని జనరల్ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా అన్నారు. కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్‌లో పోలీస్ అబ్జర్వర్ డాక్టర్ రామేశ్వర్ సింగ్, వ్యయ పరిశీలకులు ధృవ్ భోళా, మనోజ్ అలోస్ లక్రా, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్‌తో కలిసి సోమవారం పార్టీల ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల విధి విధానాలను వివరించారు. జిల్లాలో ఫ్లయింగ్ స్కాడ్ టీమ్‌లు పర్యవేక్షిస్తుంటాయని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీలు అభ్యర్థులు చేసే ప్రతి ఖర్చును ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార ఖర్చులో వాటిని లెక్కించడం జరుగుతుందని తెలిపారు. సోషల్ మీడియాలో అభ్యర్థుల రాజకీయ ప్రకటనలు వంటివి సకాలంలో ఆమోదిస్తూ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈవీఎంల వద్ద పటిష్ట భద్రత

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ అనంతరం అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈవీఎం స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని సాధారణ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా అన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి హోలీ మేరీ కాలేజీలో సోమవారం ఏర్పాటు చేసిన అసెంబ్లీ నియోజకవర్గాలైన మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ ఈవీఎంలను భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను తనిఖీ చేశారు. అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు చేపట్టి పనులు పూర్తి చేయించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

మల్కాజ్‌గిరి ఎంపీ సీటు బీఆర్ఎస్‌దే..



ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ శ్రేణులు



జవహర్‌నగర్‌లో పూరీలు వేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: మల్కాజ్‌గిరి ఎంపీ సీటు బీఆర్ఎస్‌దేనని మేడ్చల్ ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని లింగాపూర్, మైసిరెడ్డిపల్లి, ఎల్లంపేట్ గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి తరఫున సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేసిందేమీ లేదని, ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, లింగాపూర్ మాజీ సర్పంచ్ లక్ష్మీసంజీవ, పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ చేసిన అభివృద్ధే కనిపిస్తోంది

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ జవహర్‌నగర్‌లో సోమవారం ప్రచారం చేశారు. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ మేకల కావ్య హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధే కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, మేక లలితాయాదవ్, సంగీతరాజశేఖర్, సతీష్‌కుమార్, నాయకులు పిన్నోజు సుధాకర్‌చారి, సింగన్న బాలరాజు, ప్రకాష్, సాధిక్, ప్రసాద్‌గౌడ్, అహ్మద్ పాషా, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య



ఘట్‌కేసర్‌లో ప్రచారం చేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, ముత్యాలు, రాధాకృష్ణ

ఘట్‌కేసర్: కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి సైనికుల్లా పనిచేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతమహేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన ప్రచారానికి చైర్ పర్సన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని 18వ వార్డులో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన గ్యారంటీలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ మున్సిపల్ ఉపాధ్యక్షుడు నాగరాజ్ ముదిరాజ్, కౌన్సిలర్ రవీందర్, శివప్రదీప్ రెడ్డి, ఆంజనేయులుయాదవ్, చిత్తారి యాదవ్, జంగయ్యయాదవ్, నర్సింగ్‌రావు, సంజీవరెడ్డి, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

కీసర: మేడ్చల్–మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా సోమవారం మండల కేంద్రమైన కీసర, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నాగారం మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కీసర మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, తటాకం వెంకటేష్, బలిదే రమేష్ గుప్తా, మాచ్చాని జంగయ్యయాదవ్, దయానంద్‌గౌడ్, రాయిల శ్రావన్‌కుమార్‌గుప్తా, రామిడి స్వప్న, తటాకం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



కీసరలో కాంగ్రెస్ నేతల ప్రచారం

బీఆర్ఎస్ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

శామీర్‌పేట్: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వమని మూడుచింతలపల్లి మండల వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులు యాదవ్ హెచ్చరించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాపై ఇటీవల బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం మండల పరిధిలోని కొల్తూర్ గ్రామ పొలాల్లో కాంగ్రెస్ నాయకులు పర్యటిస్తూ రైతులతో మాట్లాడారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి, ప్రస్తుత మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, కొందరు బీఆర్ఎస్ నాయకులు కలిసి అమాయక గిరిజనుల భూములను లాక్కున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. మాయమాటలు చెబుతూ రైతులను, ప్రజలను మోసం చేసి 10 సంవత్సరాలు పదవులను అనుభవించి, ఇప్పుడు అధికారం పోగానే రైతుల వద్దకు చేరి కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేయడం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బోరు పాడై ఎండిన వరి పొలంలో ఫొటోలు దిగి బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని, ఇంత నీచమైన రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కంటే మెరుగైన విద్యుత్ అందిస్తున్నామని, సందేహాలుంటే చర్చకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గ్రామశాఖ అధ్యక్షుడు నర్సారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, విష్ణుగౌడ్, భూపాల్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు, జెట్రిపోతుల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో సత్ఫలితాలు



మేడ్చల్‌రూరల్: విద్యార్థులు క్రమశిక్షణ, ప్రణాళికతో ముందుకు సాగితేనే సత్ఫలితాలు సాధ్యమవుతాయని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో టెడ్ఎక్స్ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన టెడ్ఎక్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థులు తమలోని నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకొని, మెరుగైన వాణిజ్య అవకాశాలుగా మలుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా వినోద, ఆర్థిక, సాంకేతిక రంగాల నిపుణులతో ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి, వక్తలు అజయ్ హనమంతు, రాజా నరేష్, భార్గవి, నవీన్‌చారి, సతీశ్‌వర్మ, నేత్రారెడ్డి, కో ఆర్డినేటర్లు రాజ్యలక్ష్మీ, శివప్రసాద్ అధ్యాపకులు పాల్గొన్నారు.